రెండోరోజున జగన్నాధు ఒక ముసలమ్మను వెంటబెట్టుకుని "చుట్టాన్నం"టూ పోలీసు స్టేషనుకు వచ్చాడు.

కటకటాల్లోపల్నుంచి ధర్మరాజు జగన్నాధు నడిగాడు : " దొంగలంజికొడక, జీపు బండికి లైటు కొట్టొద్దురంటె కొట్టుతవు? బైటికొచ్చీసింతర్వాత నిన్నేటి సేస్తనో సూడు!"

పౌరుషంగా అన్నాడు జగన్నాధు: "నాను జలాంతరకోట రాజుగోరి కారు కె లైటుకొట్టినను. అది మద్దిలో జీడితోటలకాడ సెడిపోయినాది. ఆ వూసునాకేటెరిక? ఎప్పటేలకి సింహాశెలం గోడి ఎర్రలైటు నాకు సూపునేకపోతే నానేటి సేస్తను? సల్లగ సెట్టు దిగీసి రోడ్డుమీద నడిసొస్తుంటె మద్దిలొ రాజుగోరి కారు అగుపడినాది. 'తికమకయిపోయినాదేటా' అనుకుంట నాను శాసనాం వొచ్చీతలికి అక్కడ ఎవడూ లేడు! మీరిద్దరు మావగోరింటి కెల్లిపోయొచ్చీసినరని యీ పొద్దుటేల నాకెరికైనాది . నాదితప్పేటున్నాది? ఈ ముదనష్టపు జీపట్టుగొని మీరు సస్తరని నాను కల కనుక్కున్ననేటి?"

ధర్మరాజు శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు.

(ఆంధ్రసచిత్రవారపత్రిక 19-10-79)

★★★ ★★★ ★★★

# పని+మనీ+షి

"అబ్బ -ఎంత చవక!" అనుకున్నాను, పనిమనిషి పన్నెండు రూపాయల జీతం చాలనగానే. చింతలపూడిలో కూడా అన్ని ఊళ్ళల్లో లాగానే పని మనిషి దొరకటం కష్టం. మేము వచ్చిన కొత్తలో నానా ఇబ్బందీ పడ్డాం. అటు తర్వాత వెతగ్గా వెతగ్గా ఇద్దరు పనివాళ్ళు కనిపించారు. వాళ్ళ రేట్లు వినేసరికి నాగుండె ఆగి పోయింది. ఒకత్తెకు పాతిక ఇచ్చి, రోజూ అన్నం పెట్టి కాఫీ ఇవ్వాల్ట!ఇంకొకత్తెకు ఇరవై ఇచ్చి, దాని పన్నెండేళ్ళ పిల్లకు అడిగినప్పుడల్లా సినిమా డబ్బు ఇవ్వాల్ట! ఎంత బాధ అనిపించిందంటే గవర్నమెంటు ఉద్యోగస్తులకు చవకలో ఇళ్ళనూ, వాటితో బాటు పనిమనుషుల్నూ చూపించే పార్టీయే ప్రభుత్వం నడపటానికి తగుననీ, దానికే ఓటు వెయ్యాలనీ ప్రచారానికి బయల్దేరదామా అన్నంత! ఎంతయినా ఆడదాన్ని గాబట్టి నా క్షోభ నాలోనే ఉండిపోయింది.

సరే! ఇంకా నాలుగైదు రోజులు నా తిప్పలు నేను పడ్డాక ఇంటావిడ నా బాధ చూడలేక నా రక్షణకొచ్చింది. ఎవత్తెనో వయస్సులో వున్న ఒకదాన్ని తీసుకొచ్చి నా కప్పగించింది. " అబద్ధమాడదనీ, దొంగతనం చెయ్యదనీ, ఒళ్ళు దాచుకోదనీ దీనికి పేరుందండీ! జీతం కూడా ఎక్కువడగదనుకుంటాను. మాట్లాడుకోండి" అంది. నేను దాని వంక చూసాను. దానికి ఇరవై ఏళ్లుండొచ్చు. పిటపిటలాడుతోంది. పెద్దగా రంగు లేదు కాని, మొహం మాత్రం ఆకర్షణీయంగా వుంది. ఏ బ్యూటీ కంటెస్ట్‌లోనయినా తేలిగ్గా ప్రైజు కొట్టేసేటంత నీట్‌గా సింగారించుకునుంది.

" నీ పేరేమిటి?" నేనడిగాను. " వోనిస్రీ అండీ" అంది సిగ్గు అభినయిస్తూ. 'దీని సిగ్గు బుగ్గయిపోనూ' అనుకున్నాను. "ముగ్గెయ్యటం, అంట్లు తోటం, నీళ్ళు తోడటం, బట్టలుతకటం చెయ్యాలి. ఎంతిమ్మంటావు? ఒకే మాట చెప్పేయ్!" అన్నాను.

" అబ్బే, ఎంతిత్తారండి? మీరు మాత్తరం లచ్చాదికార్లా యేంటి? ఏదో ఉద్యోగపోల్లే గదా! పన్నెండు రూపాయలిచ్చెయ్యండి సాలు!"

అంత తక్కువ రేటుకు ఆశ్చర్యపోయాను. ' అబ్బ- ఎంత చవక!' అనుకున్నాను. అన్నాను- " ఇంకా...?" ... " ఇంకా యాంటండీ? యింకా లేదండి. పన్నెండుకు తగ్గేది లేదండి!" . " కాఫీలు, అన్నాలు, అడుగుతావా?" అని అడిగాను. " యింకేం లేదని నేనే సెప్పాను గాదండీ!" ... " నెల మధ్యలో అడిగితే అప్పటికొచ్చే జీతం మాత్రం ఇస్తాను. అడ్వాన్సు ఇవ్వను."

" అబ్బే! అట్టాంటి దాన్ని గాదండీ!"... " అప్పుడప్పుడు అట్లా సెంటరు కెళ్ళి కూరలు తెచ్చి పెట్టాలి." ... " మరే- నాకు తెల్దేటండి? కూరలు నేతేకపోతే మీకెవరు తెచ్చి పెడతారండి?" ... " అంట్లు శుభ్రంగా తోమాలి. బట్టలు ముఖ్యంగా పిల్లలివీ, ఆయన్గారివీ శుభ్రంగా ఉతకాలి." ... " మీరే సూత్తారుగా!" ...'ఇది ఎగ్రిమెంటు సమయం కనక అన్ని కండిషన్లూ ముందరే మాట్లాడుకోవటం అవసరం. లేకపోతే తర్వాత్తర్వాత నెత్తికెక్కి కూర్చుంటారు' అన్న భావంలోనేను, అప్పటికి జ్ఞాపకానికొచ్చినవన్నీ అడిగేసాను. ఇంకేం అడగాలో ఎంతాలోచించినా స్ఫురించలేదు. ఏమయినా ఉంటే అదే బయట పెడుతుందని- " నువ్వే మడుగుతావో ఇప్పుడే అడిగేయ్?" అన్నాను.

" మీ ఇంట్లో ఎంతమందండీ?" ... " మేమిద్దరం, ముగ్గురు పిల్లలు." " గాసా, కుంప టాండి?"' ..." గాసే."... అయితే పన్నెండు సాల్లెండి. మరయితే ఎప్పట్నుంచి రమ్మంటారండి?"... " రేపట్నుంచే." 'వోనిస్రీ' వెళ్ళిపోయింది. ఈసారి నాకు మతే పోయింది. 'అన్నాలు, కాఫీలు లేకుండాపన్నేండు రూపాయలకు ఆంధ్రదేశంలో కాదు- భారత దేశంలోఎక్కడయినా ఇంత చవకగా పనమనిషి పనిచేస్తుందా ఈ రోజుల్లో?' అనిపించింది నాకు.

★★★

'వోనిస్రీ' మర్నాడుదయం అయిదుగంటలకే వచ్చేసి పాచి పనిచేసేసి, నేను బయట పడేసుంచిన బకెట్లలోకి నీళ్లు తోడి వెళ్లిపోయింది. మళ్ళీ టంచనుగా ఏడుకొచ్చేసి కాఫీ గిన్నెలూ అంట్లూ తోమేసి అప్పజెప్పేసి వెళ్ళిపోయింది. మళ్ళీ మధ్యాహ్నమూడు కొచ్చింది. అంట్లు తోమేసింది. ఓ వారం గడిచింది. ఊళ్లోకి 'స్వామి అయ్యప్ప' సినిమా వచ్చింది, మర్నాడే ఆదివారం కూడా వచ్చేసింది. పిల్లల గోల ఎక్కువవటంతో మేము ఫస్టుషోకి వెళ్ళాలనుకున్నాం. ఎట్లాగో 'వోనిస్రీ' ఈ విషయం పసిగట్టేసింది.

" అడ్వాన్సు బుక్కింగులో కొనుక్కోపోతే మీకు టిక్కెట్లు దొరకవమ్మగారూ! డబ్బులివ్వండి నేను తెచ్చిపెడతా" అంది. పదిహేను రూపాయలిచ్చాను. మూడుగంట్లకల్లా టిక్కెట్లతో వచ్చేసింది." మా సెడ్డ తోపులాట గుండమ్మగారూః బ్లాకులో కొనుక్కోచ్చేసాను. బడ్డులు మిగల్లేదు" అంది.

రెండ్రోజుల తర్వాత కూరలూ, పూలూ తెమ్మనమని అయిదిచ్చి పంపించాను ' వోనిస్రీ' తిరిగొచ్చి అర్థరూపాయి చేతిలో పెట్టింది. " అదేమిటే?" అన్నాను. నేనేం చెయ్యనండీ! కూర్లు యియ్యేల రేట్లు పెరిగాయంట. పూలు అస్సలు ఒకసోటే వున్నయి. పూల్లేకపోతే పర్లేదు గానండి, కూరల్లేకపోతే తిండెట్లా గడుత్తదండి మనకి? అందుకని తెచ్చేసాను" అంది. నాలెక్క ప్రకారం నాకు రూపాయిన్నర నష్టం!

కొందరు పనిమనుషులు మహా ప్రమాదకారులు. ఇంట్లో మనం అనుకున్న మాటలు, పక్కవాళ్లతో మనం ఆడుకున్న ముచ్చట్లు శ్రద్ధగా బుర్రలో కెక్కించేసుకుని, మహా జాగ్రత్తగా మనమంటే గిట్టనివాళ్ల

దగ్గర వదుల్తూంటారు. మనస్సులు కలిసినవాళ్ల మధ్య కూడా భేదాభిప్రాయాలు సృష్టిస్తూంటారు.

గతంలో ఒకసారి, మేము కొనుక్కొన్న కొత్త మంచాలు చూట్టానికొచ్చిన ఒకావిడ- " ఆ నాయుడిగారి మంచాల సన్‌గ్లాస్ కన్నా మీ మంచాల సన్‌గ్లాస్ బాగున్నదండీ" అంది. మా పాత పనిమనిషి ఎదట ఆవిడ ఈ మాటలంది. నేనంటే అభిమానంగా ఉండే ఆ నాయుడిగారి భార్య మర్నాడు ఉమ్మడి నుయ్యి దగ్గర ఎవరితోనో మాట్లాడుతూ, " ఎవరి చేస్తుకొద్దీ వాళ్లు కొనుక్కుంటారు. దాన్ని గురించి పనివాళ్లతోఆడిపోసుకోవటం ఎంత నీచత్వమండీ! అయినా మావి ఒరిజనల్ సన్‌గ్లాస్‌షీట్లు, డూప్లికేట్లు కావు" అని నావైపు కొరకొరా చూస్తూ వెళ్లిపోయింది. నేను తెల్లబోయాను! ఇట్లాంటి పాత అనుభవాలు నాకు చాలా ఉన్నాయి.

ఈ 'వోనిస్రీ' కూడా 'మోత'ల విషయంలో మోతకెక్కినచెయ్యి అనే విషయం తెలియటానికి నాకు ఎక్కువ కాలం పట్టలేదు. ఏం వ్యత్యాసం చేసిందో కాని, ఓ నాటి ఉదయం నాకు అదే పనిగా తల తిప్పటగా ఉండి, రెండు మూడు వాంతులువెళ్ళాయి. సాయంకాలానికల్లా గంటకొకళ్లు చొప్పున నలుగురు ఆడపడుచులు మా ఇంటి కొచ్చారు. " నాలుగో గర్భమటగా! ఇంకా పెయ్యండమ్మా!" .. " ఈ వీధి నీళ్ళల్లో సుద్ద ఉందండి. మా వీధిలో కొచ్చెయ్యకూడదూ? .. " ఈ ఇంట్లో ఏదో గాలి ఉందని అనుకుంటూంటారు. మీకు తెలీదా?"... అట్లాంటి ఊరడింపు వాక్యాల్తో నాకు పిచ్చెత్తించేసారు. అయిదు రూపాయల నోటుతో మందుకోసం బజారుకోళ్ళిన ' వోనిస్రీ' సరిగ్గా అదే సమయంలో వచ్చి, రూపాయి కాయితం, రెండు క్యాప్సూల్సు నా కందించింది. అంటే, అటొచ్చి అటుపోయే పైత్యానికి అది నా చేత ఖర్చు చేయించింది నాలుగ రూపాయలన్నమాట. ఈ ఖర్చులో నిజమెంతో- అబద్ధమెంతో! వాళ్లముందర దాన్నేమని అడగను? నా ఇబ్బంది రోజుల్లో మా శ్రీవారే వంట చేస్తారు. ఇంకేం? దానదృష్టం పండింది. హోటల్నుంచి తెప్పించిన టిఫినులో సగం, గదులు ఊడ్చిన తర్వాత కాఫీలు - శ్రీవారి నుంచి దానికి ఉచితంగా సరఫరా అయ్యాయి.

★ ★ ★

ఇంకో నాలుగు రోజులు గడిచాయి. గతరాత్రి రెండో ఆట సినిమా కెళ్ళొచ్చిన మహోత్సాహంలో ఆ ఉదయం ఆలస్యంగా నిద్రలేచాను. చూద్దును గదా, బాత్రూంలో దృశ్యం ఇది- శ్రీవారు స్నానం చేస్తున్నారు ' ఇంత అందం ఏం సేసుకుంటానురా' అంటూ సన్నగా కూని రాగం తీస్తూ ' వోనిస్రీ' నీళ్ల తోడుతోంది. వంటికి చిరుగుల జాకెట్టూ చిరుగుల చీరా అదీను? ఆయన దాని వైపే తీక్షణంగా చూస్తున్నారు- చికాగ్గానే అనుకుందాం.

నాకు మాత్రం కోపమూ వచ్చింది, కంగారూ పుట్టింది.( నాది కూడా ఎంతయినా ఆడబుద్ధేకదా!) వెంటనే దాన్ని, " నువ్వు తోడక్కర్లేదు. వెళ్ళి అంట్లు చూడు" అంటూ, " నీకా చిరుగుల గుడ్డలు తప్ప వేరే ఏవీఁ లేవా?"అన్నాను. గోడకొట్టిన బంతిలాగా అది సమాధానం ఇచ్చింది. " లేవమ్మగోరూ! నెలాకర్దాకా ఇయ్యే యేసుకు రావాలి" అంది. నాకు కంగారు రెట్టింపయింది. గడగడా లోపలికెళ్ళి నాతాలూకు నడిపాత వాయిలు చీరా, జాకెట్టూ తెచ్చిదాని మొహాన పడేసాను." ఇంకెప్పుడయినా చిరుగుల బట్టల్తో పన్లోకొచ్చావో ఊరుకోనేది లేదు" అన్నాను

" ఎందుకొత్తానండమ్మా!" అంటూ వాటిని తీసుకుంది - 'వోనిస్రీ' ఎంత హీనంగా చూసినా

వాటి ఖరీదు ముప్పైకి తక్కువుండదు! ఇంకో రెండు రోజులు గడిచాయి. మా ఇంటికి చుట్టాలొస్తున్నారనీ పొద్దున్నే పెందలాడే రమ్మనమనీ చెప్పాను 'వానిస్రీ'తో . తెల్లారగానే వాళ్ళు వచ్చారు. నేను కాఫీ వగైరాల్తో అతలాకుతలం అయిపోతున్నాను. 'వానిస్రీ' ఎంతకీ రాలేదు. బారెడు పొద్దెక్కాక పక్కింటి రావుగారి పనిమనిషొచ్చి, " అమ్మా! అయ్యగార్నోపాలి పోలీసుటేసనుకాడికి రమ్మనమని చెప్పిందండి వానిస్రీ" అంది. "ఎందుకే!"అన్నాను. " రేత్తిరి రత్నా టాకీసుకాడ రౌడీ యెదవలు అల్లరి చేసేరంట. పోలీసోల్లు దాన్నట్టుగెల్లి టేషన్లో యెట్టారు. అయ్యగారొచ్చి సెపితే యిడిసిపెడతారట "

" రౌడీలు అల్లరిపెడితే దాన్ని తీసికెళ్లటం యేంటే?"... " అవ్వన్నీ నాకు తెలవ్వండి అయ్యగార్ని పంపిచ్చినా సరే, లేకపోతే..." ... " లేకపోతే?" ... " అయిదు రూపాయలిచ్చినా సరే. పోలీసోళ్ళ కియ్యాలట"

ఒక్కక్షణం ఆలోచించాను. నా కొళ్లు మండిపోయింది. అదిప్పుడు పనిలోకి రావటం నాఅవసరం కనుక, కోపం దిగమింగుకుని, అయిదు తెచ్చి దీనికిచ్చి పంపాను. 'వానిస్రీ' దేవత మధ్యాహ్నం దిగింది. తక్కుతూ తారుతూ! పోలీసు గొడవ తాలూకు కంగారేదీ దాని మొహంలో మచ్చుకైనా లేదు. దానిమీద నేను వెళ్ళగక్కిన కోపం అంతా ఇంతా కాదు. ' తిరుగుడువేషాలేసి మమ్మల్నిరికిస్తే ఒప్పుకోను' అన్నాను.

అది రెచ్చిపోయింది. " యావండోయ్! మాట్లు వదలబాకండి. నేనట్టాంటి దాన్నిగాను. అయినా ఇట్టాంటియి సిన్నయో పెద్దయో ఏ ఆడదానికయినా వుంటయ్యి. మీ రయ్యన్నీ పట్టిచ్చుకోకూడదు. అసలందుకే టేసనుకు రమ్మనమని అయ్యగార్తో సెప్పమని సెప్పాను. ఆ దొమ్మరి ముండొచ్చి మీకు సెప్పింది గావాల్ను!"

'ఏ అడదానికైనా ఉంటయ్యి' అన్నమాట మీద నాకు చిర్రెత్తు కొచ్చింది. గొంతు పెంచి చడామడా నాలుగు దులిపేశాను. దాంతో అదీ మరీ పేట్రేగిపోయింది. చివరకంది। " మీ కాడ నాక్కుదర్దండి. నా డబ్బు నాకు పారెయ్యండి." నెలవ్వటానికింకా ఐదు రోజులుంది. ఐనా దాని డబ్బులు ఏడూ తెచ్చి దానికి పడేశాను. మళ్లీ మనిషి దొరకడం కష్టంగదా, పోనీ బతిమాలి ఉంచుకుందామా అంటే, వలవేసి అది శ్రీవార్ని ఉంచుకుంటుందేమోనని భయం! (నా భయమే సుమండీ! పాపం శ్రీవారు మంచివారే!) ఆ డబ్బు తీసుకుని విలాసంగా తిప్పుకుంటూ 'వానిస్రీ' వెళ్ళిపోయింది.

ఆ మధ్యాహ్నం కూర్చుని యథాలాపంగా నావల్ల దానికి ముట్టిన డబ్బు లెక్కేశాను. జీతం కాక యాభై తేలింది. నామీద నాకే జాలేసింది!

★ ★ ★

చపక జీతం పనిమనిషంటే ఏమిటో నసాళం అంటేటట్టు అర్థమయిపోయింది.

(విజయ మంత్లీ నవంబరు 79)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★